ప్రజాశక్తి
గురువారం 27 మార్చి 2025 5 విజయనగరం

వేసవి దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలి
కార్మిక శాఖ ఉప కమిషనర్ ప్రసాదరావు

ప్రజాశక్తి-విజయనగరం

వేసవికాలం ఎండలు తీవ్రమైన నేపథ్యంలో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఇతర చోట్ల పనిచేసే వ్యక్తుల ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కార్మిక శాఖ ఉప కమిషనర్ ఎస్‌డివి ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. కర్మాగారాలు, దుఖానాలు, నిర్మాణం జరిపే భవనాల యజమానులు ఎండలను దృష్టిలో ఉంచుకొని పని వేళలు మార్చాలని, తీవ్రంగా ఎండాకాసే సమయంలో ఆరుబయట బదులు లోపలవైపు పనులు చేయించాలని సూచించారు. పని చేసే ప్రదేశంలో ఎండ నుంచి రక్షణ కోసం ఏర్పాట్లు, తాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, నీడ కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా వారు డి-హైడ్రేషన్ కు గురికాకుండా చూడాలని కోరారు.

మండుటెండలో పనులు చేస్తున్న కూలీలు

ఉపాధి కూలీల ఆకలికేకలు సర్కారుకు వినిపించడం లేదు. సుమారు 70రోజులుగా వేతనాలు అందకపోవడంతో కూలీలంతా ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. ఉగాదికైనా అందకపోతాయా? అంటూ ఎదురు చూశామని, ఆ ఆశలూ తీరినట్టు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గజపతినగరం మండలం పురిటిపెంట, గంగచోళ్లపెంట, బగ్గాం, చిట్టాయివలస, మెంటాడ మండలం మెంటాడ, ఆంధ్ర, దత్తిరాజేరు మండలం మరడాం, మర్రివలస తదితర గ్రామాల్లో ఉపాధి కూలీలను ప్రజాశక్తి పలకరించింది. 'మునుపెన్నడూ ఇన్ని రోజుల కూలి బకాయి ఉన్న పరిస్థితి లేదు. కాదు పోదు అంటూ రెండు వారాలు లేదా అత్యధికంగా 20రోజులకు మించి లేదు' అంటూ చమర్చిన కళ్లతో మనసులోవున్న దుఖ్ఖాన్ని చెప్పుకొచ్చారు. రెండేసి నెలలు జీతాలు తీసుకోకుండా అధికారులు పనిచేయగలరా? ఎంపీ, ఎమ్మెల్యేలు మాత్రం డబ్బులు తీసుకోకుండా సేవ చేస్తున్నారా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో దాదాపు ఏ గ్రామంలో విన్నా ఇదే వ్యథ.

సర్కారుకు వినిపించని
ఉపాధి కూలీల ఆకలి కేకలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వామపక్షాల ఒత్తిడితో నాటి యుపిఎ-1 ప్రభుత్వం మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం అమల్లోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం ఏటా వంద రోజులు పని గ్యారెంటీగా కల్పించాలి. 14రోజుల్లోపు వేతనాలు చెల్లించాలి. సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం చెల్లించాలి. పనిచేసిన వారం రోజుల్లోపు వేతనాలు చెల్లించాలి. చెల్లింపుల్లో జాప్యం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలి. కానీ, ఇవేవీ నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. జిల్లాలో అధికార యంత్రాంగం లక్ష్యానికి అనుగుణంగా పనులు కల్పించలేకపోయింది.

జిల్లాలో ఉపాధి గ్యారెంటీ జాబ్ కార్డులు 3.84లక్షల వరకు ప్రభుత్వం జారీచేసింది. వీటి పరిధిలో 6.84లక్షల మంది కూలీలు పనులు చేస్తున్నారు. ఇందులో 3.53లక్షల జాబ్‌కార్డుల ద్వారా 5.94లక్షల మంది కూలీలు పూర్తిగా ఈ ఉపాధి హామీ పనుల ఆధారంగానే కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. ఇందులో సుమారు 54వేల వరకు దళిత, గిరిజన కుటుంబాలు కాగా, మిగిలినవారంతా భూమి లేని ఇతర సామాజికవర్గాలకు చెందినవారు ఉన్నారు.

70రోజులుగా అందని వేతనాలు
అర్ధాకలితో వేతన జీవులు

ఈనేపథ్యంలో జిల్లాలో అత్యధిక కుటుంబాల వారికి ఉపాధి పనులే జీవనాధారం అని వేరేగా చెప్పనక్కర్లేదు. ఈ ఏడాది 1.81కోట్ల పని దినాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1.71కోట్ల పనిదినాలు మాత్రమే కల్పించినట్టు సాక్షాత్తు అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. పనిదినాల కల్పన సంగతి కాస్త పక్కనబెడితే.... జిల్లాలో సుమారు 26లక్షల పనిదినాలకు సంబంధించి దాదాపు రూ.53కోట్లు బకాయి ఉంది. బకాయి పేరుకుపోయి సుమారు 2నెలల పది రోజులు కావస్తుండడంతో కూలీల అవస్థలు వర్ణణాతీతం. తిండిగింజలు కూడా కొనుక్కోలేకపోతున్నామని గజపతినగరం మండలం గంగచోళ్లపెంటకు చెందిన అక్కందర రాము ఆవేదన వ్యక్తం చేశాడు. తాను వారంలో ఆరు రోజులపాటు పనిచేస్తున్నానని, ఇప్పటి వరకు తొమ్మిదివారాలకు సంబంధించి 54 రోజుల వేతనం ఇవ్వాల్సివుందని ఆవేదన వెల్లగక్కాడు. తనకు ఇతర ఆదాయాలేవీ లేవని, కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని చెప్పాడు. గ్రామంలోని మరికొందరితోపాటు చిట్టాయివలసకు చెందిన చిన్నంనాయుడు, బగ్గాం గ్రామాలకు చెందిన నారాయణప్పడు కూడా తమ రావాల్సిన వేతన బకాయిల ఫలితంగా ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజాశక్తి ఎదుట వాపోయారు.

ఆమాసకి కూడా అందేటట్టు లేదు

కూలి డబ్బులు అందకపోవడంతో తిండికి కూడా ఇబ్బంది పడుతున్నాం. ఎండతో పనిచేసి ఇంటికి వెళ్లి కనీసం నిమ్మకాయ నీళ్లు కూడా తాగలేని పరిస్థితి. 30రోజుల వేతనం నాకు అందాల్సి వుంది. అదుగో ఇదిగో అంటూనే రెండు నెలలు గడిచిపోయాయి. కనీసం కొత్తామాస (ఉగాది)కైనా కూలి డబ్బులు చెల్లించినట్లు కనిపించడం లేదు. ఇంత దారుణం నేనెప్పుడూ చూడలేదు.

గాడు సూర్యనారాయణ
గంగచోళ్లపెంట,
గజపతినగరం మండలం

పలు సమస్యల పరిష్కారానికి సిఎం ఆదేశం

- కలెక్టర్ల సదస్సులో ముఖ్య సమస్యలను ప్రస్తావించిన అంబేద్కర్
- తోటపల్లి కాలువలు, రామతీర్థసాగర్ ప్రాజెక్టు పూర్తికి, ట్రైబల్ యూనివర్సిటీలో వసతుల కల్పనకు సిఎం ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం

రాజధాని అమరావతి వేదికగా జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో ప్రధాన సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని తారకరామతీర్థ సాగరం, తోటపల్లి కుడికాలువ సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి వెంటనే చర్యలు చేపట్టాలని జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌కు ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్‌ల సదస్సు రెండో రోజైన బుధవారం ఆయా జిల్లాల అభివృద్ధికి, వృద్ధిరేటు సాధించేందుకు తాము అనుసరించనున్న వార్షిక కార్యాచరణ ప్రణాళిక, జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వ పరంగా అందించాల్సిన సహకారంపై ఆయా జిల్లాల కలెక్టర్‌లు ప్రజంటేషన్ చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.

జిల్లా అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్టు కీలకం కానుందని, దీనికి అవసరమైన నీటిసరఫరాను తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు నుంచే చేయాల్సి వుందని, వచ్చే జూన్ లో ఎయిర్‌పోర్టు సిద్ధమయ్యే నాటికి నీటి సరఫరా చేయాల్సి వున్నందున ఈ సాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయాలని సిఎం దృష్టికి కలెక్టర్ తీసుకువెళ్లారు. ఈ ప్రాజెక్టు పూర్తిచేయడం ద్వారా ఎయిర్ పోర్టుకు నీటి సరఫరాతోపాటు విజయనగరం పట్టణానికి తాగునీటి సరఫరాను మెరుగుపరచవచ్చని, జిల్లాలో మరో 16వేల ఎకరాల అదనపు ఆయకట్టుకు సాగునీటిని కూడా అందించడం సాధ్యమవుతుందన్నారు. సిఎం స్పందిస్తూ ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత క్రమంలో పూర్తిచేసేందుకు నిధులు ఏమేరకు అవసరమవుతాయో అంచనాలు వేసి నివేదించాలని జలవనరుల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

తోటపల్లి కుడికాల్వను కూడా పూర్తిచేయడం ద్వారా 23,119 ఎకరాల ఆయకట్టుకు అదనంగా సాగునీటిని అందించవచ్చని తద్వారా జిల్లాలో తలసరి ఆదాయం పెరిగే అవకాశం వుందని కలెక్టర్ వివరించారు. ఈ ప్రాజెక్టు పూర్తిచేసేందుకు రూ.105.63 కోట్లు అవసరమవుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల మంజూరుకు ప్రతిపాదనలు తయారు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. చింతపల్లి వద్ద ఫిష్ లాండింగ్ సెంటర్ నిర్మాణాన్ని ఎపి మారిటైమ్ బోర్డు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని, తద్వారా

సిఎంకు జిల్లా సమస్యలను వివరిస్తున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అవకాశం ఏర్పడు తుందని కలెక్టర్ వివరించారు. దీనిపై మాట్లాడి నిర్మాణంలో వున్న అవరోధాలను తొలగించే ప్రయత్నం చేయాలని మత్స్యశాఖ ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు.

జిల్లాలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటులో భాగంగా నీటిసరఫరా, ఎప్రోచ్ రోడ్డు, విద్యుత్ సరఫరా, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చర్యలు చేపట్టాల్సి వుందని, ఇందుకు అవసరమైన నిధులు రూ.29.15 కోట్లను విడుదల చేయాలని కలెక్టర్ కోరగా సిఎం స్పందిస్తూ ఉన్నతవిద్యాశాఖ ద్వారా అవసరమైన నిధుల విడుదలకు చర్యలు చేపట్టాలని ఆ శాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను ఆదేశించారు.

జిల్లాలో డయాలసిస్ యూనిట్ల ఏర్పాటు ఆవశ్యకత వుందని, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో కొన్నింటిని జిల్లాలో ఏర్పాటు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా ఐదు యూనిట్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ కోరగా, దీనిపై తగిన చర్యలు చేపట్టాలని వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును సిఎం ఆదేశించారు. జిల్లాలో పర్యాటకుల వసతుల కల్పనలో భాగంగా పర్యాటకుల కోసం హోటళ్లను నిర్మించి అందుబాటులోకి తీసుకురావలసి వుందని సిఎం చెప్పారు. జిల్లాల్లో పర్యటనలకు వచ్చే పర్యాటకులు ఆయా జిల్లాలోనే రాత్రి బస చేసేలా అనువైన వసతులు ఏర్పడాల్సి వుందని పేర్కొన్నారు. జిల్లా ఇన్ ఛార్జి మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఉత్తరాంధ్ర జోనల్ ఇన్ ఛార్జి అధికారి బి.రాజశేఖర్ కూడా సమావేశంలో మాట్లాడారు.

ఆప్కాస్ నుంచి తొలగించొద్దు

- ముస్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు లేఖ
- 1న నిరసనలకు ముస్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరపాలక సంస్థ కార్మికులను ఆప్కాస్ నుండి తొలగించి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని, తమ సేవలకు గుర్తింపుగా పారిశుధ్యం, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని కోరుతూ మంత్రి నారాయణకు ముస్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు రాష్ట్ర ముస్సిపల్‌శాఖా మంత్రి నారాయణకు లేఖ రాశారు.క˜రోనా సమయంలోనూ, గతంలో విశాఖ హుదూద్ తుఫాను, ఇటీవల విజయవాడ వరదల ముంపు ప్రాంతాల్లోను విజయనగరం నుంచి వెళ్లి ప్రాణాలకు తెగించి సేవలందించారని, నిత్యం అభద్రతతో కూడిన ఉద్యోగులుగా చేయడం ఏమాత్రం సమంజసం కాదని సిఐటి యు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి ముస్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.జగన్మోహనరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు విలేకర్ల సమావేశంలో మంత్రి నారాయణకు రాసిన లేఖను విడుదల చేశారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు వారిని ఆదుకునేందుకు మేము వస్తులుండి కూడా పనిచేస్తున్నారని, కానీ శ్రమకు నిజమైన గుర్తింపు ఇవ్వడంలేదన్నారు. ప్రస్తుతం ఆప్కాస్ ద్వారా ప్రతి నెలా ఒకటవ తేదీన జీతం వస్తుందని, పిఎఫ్, ఇఎస్ఐ, వాటా నిధులు సక్రమంగా కార్మికుల ఖాతాలలో జమ అవుతున్నాయన్నారు. ఆప్కాస్ లో మమ్మల్ని

లేఖను విడుదల చేస్తున్న ఫెడరేషన్ నాయకులు

ఉద్యోగులుగా నమోదుచేసి సంక్షేమపథకాలు లేకుండా చేసిందన్నారు. ప్రస్తుతం తమ తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఆప్కాస్ తొలగించి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ప్రయత్నాలలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఇదే జరిగితే పిఎఫ్. ఇఎస్ఐ డబ్బులు సక్రమంగా ఖాతాల్లో జమకావని, నిత్యం వేధింపులు, బెదిరింపులు, అక్రమ తొలగింపులు పెరిగి అవస్థలు పడాల్సి వస్తుందన్నారు.కావున మంత్రి గారు స్పందించి ఆప్కాస్, ప్రైవేట్ ఏజెన్సీలు కాకుండా మా ఉద్యోగాలు పర్మినెంట్ చేసి మా కుటుంబాలకు న్యాయం చెయ్యాలని కోరారు. అందులో భాగంగా ఏప్రిల్ 1న నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు బి.భాస్కరరావు, రాఘవ, ఆదినారాయణ, దుర్గారావు, హరిబాబు, నారాయణరావు, రాము కార్మికులు పాల్గొన్నారు.

31తో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూత : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

ఖరీఫ్ 2024-25 సీజన్‌కు జిల్లాలో ధాన్యం కొనుగోలు చివరి దశకు చేరుకున్నందున ప్రస్తుతం కొనసాగుతున్న అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈనెల 31న మూతపడతాయని జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 487 రైతు సేవా కేంద్రాల ద్వారా 3.34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, జిల్లాలో 72,845 మంది రైతులకు రూ.768 కోట్లు చెల్లింపులు చేశామని తెలిపారు. రైతుల వద్ద ఇంకా ధాన్యంమిగిలి ఉంటే గడువు లోగా విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సహాయం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని రాయుడపేటలో అగ్నిప్రమాద బాధితులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన ఎమ్మెల్యే కోళ్లలలితకుమారి చేతుల మీదుగా బుధవారం వంట సామాన్లు, రగ్గులు పంపిణీ చేశారు. తాహశీల్దార్ జె.రాములమ్మ, జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు టి.సూర్యారావు, ఎస్ కోట బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వరలక్ష్మి, జిల్లా రెడ్ క్రాస్ ప్రతినిధులు ఎం.రాము, సిహెచ్ మన్మధరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

భౌతికశాస్త్రం పరీక్షకు 119 మంది గైర్హాజరు

విజయనగరంటౌన్ : జిల్లాలో బుధవారం జరిగిన 10 వతరగతి భౌతిక శాస్త్రం పరీక్షకు 119 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 22,919 మంది హాజరు కావాల్సి ఉండగా, 22,800 మంది హాజరయ్యారు. ప్రైవేటు విద్యార్థులు 430 మందికి 359 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డిఇఒ మాణిక్యం నాయుడు తెలిపారు.

అందుబాటులోకి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

విజయనగరంకోట : జిల్లాలో తొలి నుండి తమ కుటుంబం ఆధ్యాత్మికరంగంతో పాటు సినిమా రంగంలో కూడా కృషి చేస్తోందని ఎన్‌సిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎన్‌సిఎస్ థియేటర్‌లో క్రిస్టీ ఆర్ జి బి 4435 లేజర్ ప్రొజక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం సినీ ప్రేక్షకులకు స్కోప్, డిటిఎస్, 2 కె, 4 కె, 7.1, డాల్బి అట్మోస్‌లను తమ కుటుంబమే పరిచయం చేసిందని అన్నారు. సరికొత్తగా ఉభయ తెలుగు రాష్ట్రాలలో తొలిసారి తమ థియేటర్‌లో క్రిస్టీ ఆర్‌జిబి 4435 లేజర్ ప్రొజక్టర్ ప్రారంభించబడడం సంతోషకరమని అన్నారు.

నేడు వైస్ ఎంపిపి ఎన్నిక

- వైసిపికే దక్కనున్న పదవి
- రేసులో భోగాపురం ఎంపిటిసి నాగలక్ష్మి
- పోటీకి దూరంగా టిడిపి కూటమి

ఎన్నికకు సిద్ధమైన మీటింగ్ హాలు

ప్రజాశక్తి- భోగాపురం

భోగాపురం మండల పరిషత్ వైస్ ఎంపిపి ఎన్నిక గురువారం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నికల అధికారిగా జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ వెంకటరమణను నియమించిన విషయం తెలిసిందే. ఉదయం 10 గంటల లోపు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. వెను వెంటనే నామినేషన్లను పరిశీలన చేసి పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. పోటీలో ఉండే అభ్యర్థులను చేతులెత్తే విధానంలో ఎంపిటిసిలు ఎన్నుకోనున్నారు. ఎన్నికైన అభ్యర్థిని వెంటనే ప్రకటించనున్నారు.

వైసిపికి ఏకగ్రీవం కానున్న వైస్ ఎంపిపి పదవి

వైస్ ఎంపిపి పదవి వైసిపికే దక్కనున్నట్లు చర్చ జరుగుతుంది. టిడిపి ఉన్నప్పటికీ వారికి తగినంత సంఖ్యాబలం లేకపోవడంతో పోటీకి దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకే ఒక నామినేషన్ దాఖలయ్యే అవకాశం ఉంది.ఇదే జరిగితే ఎన్నిక ఏకగ్రీవం కానుంది. మండలంలో మొత్తం 16 ఎంపిటిసి సభ్యులు ఉన్నారు. ఇటీవల వైసిపికి చెందిన పడాల సత్యవతి వైస్ ఎంపిపి పదవికి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. దీంతో ప్రభుత్వం ఈ ఎన్నికకు మళ్లీ నోటిఫికేషన్ జారీ చేసింది. వైసిపి చేతిలో తొమ్మిది ఎంపిటిసిలు, తెలుగుదేశానికి ఆరు ఎంపిటిసిలు, జనసేనకు ఒక ఎంపిటిసి స్థానం ఉన్నాయి. కానీ కూటమి సభ్యులు దాదాపుగా ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు.

భోగాపురం -1 ఎంపిటిసికే వైస్ ఎంపిపి పదవి

భోగాపురం గ్రామానికి చెందిన న్యాయవాది పచ్చిపాల గురునాథరావు భార్య నాగలక్ష్మికి వైస్ ఎంపిపి పదవి దక్కనున్నట్లు తెలిసింది. ఆమె భోగాపురం-1 ఎంపిటిసిగా ఉన్నారు. వైసిపి నాయకులంతా కలిసి ఆమెను ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. ఎంపిటిసిలందరికీ పార్టీ తరపున ఎంపిపి అనూష రెడ్డి విప్‌ను కూడా జారీ చేశారు.

ప్రభుత్వ నిధులతో ప్రయివేటు పాఠశాలకు వేసిన రహదారి

కబ్జాలు చేసినా పట్టించుకోరా?

ప్రజాశక్తి- వేపాడ

మండల కేంద్రంలోగల ఒక ప్రైవేటు పాఠశాలకు పల్లె పండగ పేరుతో రూ.12లక్షల నిధులతో రహదారి వేయడం చర్చ నీయాంశమైంది. తాగునీటి కోనేరుకు, పశువుల కోనేరుకు మధ్య ఉన్న గట్టును చదును చేసి ఇరువైపులా తొమ్మిదేళ్ల క్రితం వేసిన నీడనిచ్చే మొక్కలను కూడా తొలగించి ప్రైవేటు పాఠశాలకు సుమారు రూ.12 లక్షలు ఎమ్మెల్యే నిధులతో దర్జాగా రోడ్డు వేశారు. రోడ్డు పక్కన ఉన్న చాకలి కోనేరును కప్పేసి, వాహనాలను నిలుపుకునేందుకు దౌర్జన్యంగా ఆక్రమించారు. ఈ విషయం తహశీల్దార్‌కు, ఎంపిడిఒకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు లేవు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన అధికారులే కబ్జాలు చేస్తున్న నాయకులకు అండగా ఉంటే ప్రభుత్వ ఆస్తులను కాపాడేది ఎవరంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఫిర్యాదుదారుల సమక్షంలో విచారణ జరిపి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్.కృష్ణమూర్తి, ఎన్.సింహాచలంనాయుడు, జి.శ్రీను, ఎన్.కృష్ణవేణి జె.లక్ష్మణరావు,డి.దేముడు తదితరులు ఫిర్యాదు చేశారు.

నగరాభివృద్ధిని అడ్డుకుంటున్నదెవరు?

కో ఆప్షన్ సభ్యుడి వ్యాఖ్యలపై చర్చ • పాలకవర్గం వైసిపిదా? టిడిపిదా?

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివృద్ధి తొమ్మిది నెలలుగా కుంటు పడిందా? ఎవరి వలన? దీనికి కారణం పాలకవర్గంలో ఉన్న వైసిపిదా, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వానిదా?.. పాలకవర్గం చేస్తున్న అభివృద్ధిని టిడిపి నాయకులు అడ్డుకుంటున్నారా?, పాలక వర్గం నిర్ణయాలు అమలు కావడం లేదా? నగర పాలక సంస్థ లో అధికారులు పాలకవర్గానికి సహకరించడం లేదా? ఇలా నగరంలో ఎక్కడ చూసినా చర్చ జరుగుతోంది. ఈనెల 22న జరిగిన నగర పాలక సంస్థ పాలకవర్గ సమావేశంలో పాలకవర్గ సభ్యులు చేసిన వ్యాఖ్యలతో ఈ చర్చకు తెరలేచింది. నగరాభివృద్ధి గత తొమ్మిది నెలలుగా కుంటు పడిందని నగర పాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు చేసిన వ్యాఖ్యలు ఈ చర్చకు దారితీశాయి. నగరంలో ఏ పనులు చేసినా అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఖాతాలోకి వెళ్తాయనే భయంతో ఆయన అన్నారా? లేదా రాజకీయ విమర్శ కోసం అన్నారా అనేది పక్కన పెడితే అభివృద్ధి కుంటుపడిందని చేసిన వ్యాఖ్యలు విమర్శలకు తావు ఇచ్చాయి. నగర పాలక సంస్థ పాలకవరవ్గంలో 50 మందికి గాను 47 మంది కార్పొరేటర్లు వైసిపికి చెందిన వారే ఉన్నారు. పూర్తి స్థాయి అధికారం వైసిపి పాలకవర్గం చేతిలో ఉంది. నగరంలో ఏ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్న, ప్రజలకు ఎటువంటి సేవలు అందించాలన్న తీసుకునే నిర్ణయాధికారం వైసిపి పాలకవర్గానికే ఉంది. అటువంటిది పాలకవర్గ సభ్యులే ఇటువంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పాలకవర్గం అచేతనం బయట పెట్టినట్లు ఉందనే చర్చ సాగుతోంది. కేవలం మాజీ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి ఓటమి కావడంతో నగరాభివృద్ధి కుంటు పడిందా అనే చర్చ సాగుతోంది. మరి పాలకవర్గం ఏమి చేస్తుందనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. వాస్తవానికి ఎమ్మెల్యేగా కోలగట్ల ఓటమి తర్వాత వైసిపి శ్రేణులు డీలా పడ్డారు. వైసిపి చేతిలో పాలకవర్గం ఉన్నా లేనట్టే ఉన్నారు. కేవలం సమావేశాలకు రావడం,సమావేశంలో ఎజెండాలోని అంశాలను ఆమోదించడం వెళ్లిపోవడమే గాని సమస్యలపై ప్రశ్నించే వారు లేరు. మరోవైపు గెలిచిన ఎమ్మెల్యే నగర పాలక సంస్థ నిర్ణయాల్లో పాల్గొనడం లేదు. ఇలా అయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలో ఎలా గెలుస్తామనే ఆలోచనలో టిడిపి శ్రేణులు అన్నారు. ఎమ్మెల్యే నగర పాలక సంస్థ నిర్ణయాల్లో భాగస్వామ్యం కావడం లేదని చర్చ జరుగుతుంటే అధికార పాలకవర్గంలో కో ఆప్షన్ సభ్యుడు అభివృద్ధి కుంటుపడిందని చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. పాలకవర్గాన్ని చేతిలో పెట్టుకొని ఇటువంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కో ఆప్షన్ సభ్యుడు వేణు

యోగా అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అంతర్జాతీయ స్థాయిలో యోగా అభివృద్ధి, ప్రమోషన్‌కు అత్యుత్తమ కృషి చేసినందుకు 2025 సంవత్సరానికి ప్రధానమంత్రి యోగా అవార్డుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డులు నిష్కళంకమైన ట్రాక్ రికార్డ్, యోగా ప్రమోషన్, అభివృద్ధికి అత్యుత్తమ సహకారం అందించిన వ్యక్తులు / సంస్థలకు భారత ప్రభుత్వం, ఆయుష్ మంత్రిత్వ శాఖ అవార్డులు ఇస్తాయని తెలిపారు.దరఖాస్తులను https://innovateindia.mygov.in/pm-yoga-awards ఆన్‌లౌన్ పోర్టల్ ద్వారా స్వయంగా దరఖాస్తులను ఈనెల 31లోగా పంపాలని తెలిపారు. వివరాలకు రూప్‌కుమార్ 9491767327 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని 13ఆదర్శ పాఠశాలలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు డిఇఒ యు.మాణిక్యంనాయుడు తెలిపారవు. 5వ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత కలిగిన విద్యార్థులు 6వ తరగతిలో ప్రవేశానికిwww.cse.ap. gov.in/ apms.ap.gov.in వెబ్ సైట్‌లో ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ప్రవేశ రుసుం రూ.75, ఒసి, బిసి విద్యార్థులకు ప్రవేశ రుసుం రూ.150 అని తెలిపారు. వివరాలకు సంబంధిత ఆదర్శపాఠశాలల ప్రధానాచార్యులను సంప్రదించాలని తెలిపారు.

బాలల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్‌గా వెంకటరమణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్‌గా కంది వెంకటరమణ నియమితులయ్యారు. బుధవారం కెఎల్‌పురంలోని ఎపిజిఇఎ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నిక జరిగింది. కన్వీనర్‌గా కంది వెంకటరమణ, ప్రధానకార్యదర్శి గా వైఎ చిన్నారావు, మహిళా కన్వీనర్‌గా ఎ.రాజేశ్వరి, మీడియా ఇంచార్జ్‌గా దువ్వు దేవీప్రసాద్, లీగల్ ఎడ్వైజర్‌గా అబ్దుల్ కరీం ఎన్నికయ్యారు, వీరితోపాటు కో కన్వీనర్లు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా 24 మందికి నియామక పత్రాలను రాష్ట్ర చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ పోర్స్ కన్వీనర్ గురుగుబిల్లి దామోదరరావు అందజేశారు.

పనిచేసే చోట నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

9 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం అన్యాయం

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు తొమ్మిది నెలలుగా బిల్లులు చెల్లించకపోవడం అన్యాయమని, కూలీలు ఎలా బ్రతకాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు అన్నారు. బుధవారం పాతసుంకర పాలెం చెరువులో ఆయన కూలీలతో కలిసి నిరసన తెలిపారు. వచ్చే నెల ఒకటవ తేదీన జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తుందన్నారు. కేంద్రంలో మరోమారు బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ చట్టంలో పెను మార్పులు తీసుకువచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కూలీలకు నిధులు తగ్గించడం, కూలీలకు పని కల్పించకపోవడం వంటి కార్యక్రమాలు తరచూ జరుగుతున్నాయని చెప్పారు. కూలీలకు 200 పని దినాలు కల్పించాలన్నారు. రోజుకి కూలీలకు 600 రూపాయలు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మృతి చెందిన కార్మికునికి లక్ష రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింహాచలం, సూర్యనారాయణ, లక్ష్మి, పార్వతి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రాల ద్వారా యువతలో మార్పు

ప్రజాశక్తి- బొబ్బిలి

యువతలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ఆలోచన రేకెత్తించే మరిన్ని లఘు చిత్రాలు రూపొందాలని వాటి ద్వారా యువతలో మార్పు వచ్చే అవకాశం ఉందని బొబ్బిలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ పి.చిన్నం నాయుడు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో బొబ్బిలి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో రూపొందిన 'డ్రగ్స్' లఘు చలన చిత్రాన్ని యూ ట్యూబ్‌లో ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో యువకులు మత్తు పదార్థాల బారినపడి తమ జీవితాలను ఎలా నాశనం చేసుకుంటున్నారో, తల్లిదండ్రులు బాధపడే సన్నివేశాలను మనసును హత్తుకునేలా చూపించారనీ అన్నారు. తమ శాఖ నుండి ఇలాంటి లఘు చిత్రాల నిర్మాణానికి ఎప్పుడూ ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. బొబ్బిలి ఫిలిం సొసైటీ అధ్యక్షుడు యం.విజయ మోహన్ రావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా మాదక ద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై అవగాహన కోసం ఇప్పటివరకు ఆరు చిత్రాలు నిర్మించామన్నారు. ప్రస్తుతం డిజె స్టూడియోస్ సమర్పణలో విడుదల చేసిన ఈ 'డ్రగ్స్' లఘు చిత్రంలో సిఐ చిన్నంనాయుడు, వనమిత్ర కృష్ణదాస్, విజయ మోహన్ విహారి ప్రధాన పాత్రలు పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎస్.ఆనంద్, ఎ.ప్రసాద్, సభ్యులు టీ.కమల్‌కుమార్, డి.వెంకటరమణ, జి.కేశవ, కే. హరి, ఎం.చైతన్య రామ్ పాల్గొన్నారు.

పిల్లలకు నాణ్యమైన విద్యను బోధించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు నాణ్యమైన విద్యను బోధించేందుకు ప్రభుత్వం శిక్షణ ఇస్తుందని ఐసిడిఎస్ పిఒ జె.విజయలక్ష్మి తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తల శిక్షణను బుధవారం ముగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు నాణ్యమైన విద్యను, మంచి పోషకాహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని కోరారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో వాతావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - వేపాడ

ప్రకృతి వ్యవసాయంతో వాతావరణ పరిరక్షణ జరుగుతోందని అడిషనల్ డిపిఎం స్వామినాయుడు అన్నారు. మండలంలోని సింగరాయి, దబ్బిరాజుపేట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులను మెరుగుపరచడానికి భవిష్యత్తును పరిరక్షించడానికి వారు ఉన్నతకి ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారానే వాతావరణంలో వస్తున్న మార్పులను అధిగమించి మంచి వాతావరణాన్ని పొందగలమని అన్నారు. రైతులు నవధాన్యాలు సాగు చేయాలని దీని ద్వారా భూమిలో సేంద్రియ కర్బూరం పెరిగి పంటకి అవసరమైన పోషకాలను ఎటువంటి ఎరువులు లేకుండా పొందగలమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్‌లు నిరుద్యోగ వెంకటరావు, దండుపాటి ముత్యాలమ్మ, ఎంపిటిసి చామంతుల లక్ష్మీ, గంగాధర్, గ్రామ పెద్దలు ఏడవాక దేవుడు నాయుడు, కోన సత్యం, తాడి కృష్ణ, ఏడవాక రామకృష్ణ, పొట్నూరి సూర్యనారాయణ, విఎఎ దేముడు, కోమలత, ప్రకృతి సిబ్బంది గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను పకడ్బందీగా సిద్ధం చేయాలన ఇఒపిఆర్‌డి ఏ.భాస్కరరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శిలతో జిపిడిపి తయారీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 -2026 సంవత్సరానికి గాను పల్లెల్లో అవసరాలకు అనుగుణంగా 15వ ఆర్థిక సంఘ నిధులు, పంచాయతీ, జనరల్ ఫండ్, వివిధ రకాల నిధులు రాబట్టేందుకు, అందుకు అనుగుణంగా పల్లెలు అభివృద్ధి చేసేందుకు ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్ లోడ్ చెయ్యాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కార్యదర్శిలు నారాయణరావు, ఆశజ్యోతి, రవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

వడగాల్పుల నుంచి కార్మికుల రక్షణకు రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలు పాటించాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.కిరణ్ చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని లేబర్ ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున కార్మికులకు అవసరమయ్యే వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. మండల కార్మిక పరిధిలో విద్యాసంస్థలలోనూ, వివిధ దుకాణాలలోనూ, భవన నిర్మాణ కార్మికులకు యాజమాన్యాలు మంచినీటితో పాటు ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల అందుబాటులో ఉంచాలన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉష్ణోగ్రత తీవ్రంగా ఉన్న సమయంలో పనులు చేపట్టకుండా ఉష్ణోగ్రత తక్కువగా ఉన్న సమయంలోనే భవనిర్మాణ కార్మికులతో పని చేపట్టాలని వారికి అత్యవసర ప్రథమ చికిత్స మందులు కూడా ఏర్పాటు చేయాలని కమిషనర్ ఆదేశించినట్లు లేబర్ ఆఫీసర్ తెలిపారు.

క్రాష్ ప్రోగ్రామ్ పరిశీలన

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని ఎం. రావివలసలో జరుగుతున్న క్రాష్ ప్రోగ్రామ్‌ను బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శివబాబు పరిశీలించారు. మరమ్మతులు చేపడుతున్న చేతి పంపు బావులను తనిఖీ చేశారు. అనంతరం సోమలింగాపురంలో ఘణ వ్యర్థాలు నుండి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీనియర్ బోర్ మెకానిక్ దేవుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జగదీష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు

బొబ్బిలి : బొబ్బిలి పాతకోటలో గల మాజీ సైనిక సంక్షేమ కార్యాలయంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి బుధవారం మాజీ సైనికుల సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి పరిసర ప్రాంతాల మాజీ సైనికులు, వితంతువులు, వికలాంగులకు డిపెండెంట్ ఐడెంటిటీ కార్డులు, క్యాప్ సర్టిఫికెట్లు, ఇంటి పన్ను మినహాయింపు, వంటి సుమారు 62 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మాజీ సైనికుల కోసం సిఎస్‌డి క్యాంటీన్ విజయనగరంలో స్థాపించడానికి ప్రతిపాదనలు పంపామన్నారు. బొబ్బిలి ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిని ఎంపానల్మెంట్ చేయడానికి ఆలోచిస్తున్నామని తెలిపారు. మాజీ సైనికుల కోసం ఇళ్ల స్థలాలు కేటాయించాలని అందుకు తగిన ప్రభుత్వ భూమిని గుర్తించాలని రెవెన్యూ శాఖకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మరణ రామినాయుడు, అధ్యక్షులు రేవల్ల కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి ఎ.గోవిందనాయుడు, జాయింట్ సెక్రటరీ రవీంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ఇళ్ల పట్టాలివ్వాలని ఎమ్మెల్యే బేబినాయనను సిఐటియు జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, కార్మికులు కోరారు. ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం బేబినాయనను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకం రావు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న పారిశుధ్య కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోవడంతో ఇరుకు ఇళ్లలో నివసిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాకివీధి పక్కనున్న మున్సిపల్ స్థలంలో పారిశుధ్య కార్మికులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరగా 10రోజులలో సమస్య పరిష్కరిస్తామని బేబినాయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘ నాయకులు యుగంధర్, కార్మికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతినిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పేద ముస్లిములకు నిత్యావసరాలు పంపిణీ

రంజాన్ సందర్భంగా హుదా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం షాదిఖానాలో పేద ముస్లింలకు ఎమ్మెల్యే బేబినాయన నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను బేబినాయనకు వివరించారు. ఆరికతోటలో ముస్లింలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, శ్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, షాదిఖానా ఆధునీకరణ చేయాలని ముస్లింలు కోరగా సమస్యలు పరిష్కారానికి బేబినాయన హామీ ఇచ్చారు. హుదా సభ్యులు బాబ్జి, భాషాను బేబినాయన సన్మానించారు. కార్యక్రమంలో కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జెసి రాజు, హుదా సభ్యులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలి

నీట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బేబినాయనను ప్రైవేట్ కళాశాల యాజమాన్య అసోసియేషన్ సభ్యులు వంశీ కోరారు. ఎమ్మెల్యే బేబినాయనకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. నీట్ పరీక్షకు మార్చి 7లోగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చినప్పటికీ ఇంటర్ ప్రాక్టికల్, పబ్లిక్ పరీక్షలు జరగడంతో చాలామంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేదన్నారు. పరీక్షలు బిజీలో చాలామంది విద్యార్థులు నీట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకోలేదని, దీంతో చాలామంది విద్యార్థులు వైద్య చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని చెప్పారు. నీట్ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకుంటామని బేబినాయన హామీ ఇచ్చారు.

వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీలో పన్ను వడ్డీ రాయితీ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కె. అప్పలరాజు తెలిపారు. బుధవారం ఆయన నగర పంచాయతీలో ఆస్థి పన్నుపై 50 శాతంవడ్డీ రాయితీ గురించి ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్థి పన్ను వడ్డీ 50శాతం రాయితీతో చెల్లించవచ్చని తెలిపారు. దీనిలో భాగంగా ఆర్థిక సంవత్సరంలో ఈ నెల 31లోగా ఆస్థి పన్ను, ఖాళీ స్థలాలు పన్ను బకాయి ఉన్న వారు ఏక మొత్తంలో రాయితీతో చెల్లించవచ్చని చెప్పారు. పన్ను బకాయి ఉన్నవారు వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకువాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాభాస్కర్, సచివాలయం అడ్మిన్ లీలప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నిర్లక్ష్యం : పీడీ

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద 2023-24 సంవత్సరానికి సంబందించి ఉపాధి హామీ పని సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిట్ బృందం నివేదికలను సభ ముందు పెట్టింది. మండలంలోని సుమారు రూ.24 కోట్లతో పనులు జరిగాయని, వాటికి సంబందించి ఆడిట్ చేశామన్నారు. ఆడిట్ అనంతరం 23 లక్షలు రికవరీ రాశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సామాజిక తనికీని సిబ్బంది ఈజీగా తీసుకుంటున్నారన్నారు. పనుల్లో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. పనులు దగ్గర నేమ్ బోర్డులు లేకపోవడం ఘోరమన్నారు. ఇకపై పని ప్రారభంలోనే నేమ్ బోర్డులు నిర్మాణం చేసి, పని పూర్తయిన తరువాత పేర్లు రాయాలన్నారు. పని ప్రాంతాల్లో తాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స బాక్స్‌లు తప్పనిసరిగా ఉండాలన్నారు. తార్పాలిన్లు లేని చోట చలువ పందిర్లు వేయాలన్నారు.

వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ

సమాచారం లేదు: సర్పంచులు

ఉపాధి హామీ సామాజిక తనికీకి సంబందించి గ్రామసభలలు పెట్టలేదని, సమాచారం ఇవ్వలేదని పీడీ ముందు పేరాపురం సర్పంచ్ రౌతు శ్రీరామూర్తి అన్నారు. ఎన్నికల కోడ్ వల్ల గ్రామ సభలు పెట్టలేకపోయామన్నారు. అయినా సోషల్ ఆడిట్ సమాచారం ఇవ్వలేదని చల్లవానితోట మాజీ సర్పంచ్ పతివాడ శ్రీను తదితరులు అడిగారు. సమాచారం ఇవ్వకపోవడం స్థానిక సిబ్బంది లోపం అని ఆమె సమాధానం చెప్పారు.

లైంగికంగా వేధిస్తే 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

బాల, బాలికలను లైంగికంగా వేదిస్తే కనీసం 20 ఏళ్ల జైలు శిక్ష ఉంటుందని ఫ్యామిలీ కోర్టు జడ్జి కె.విజయకళ్యాణి అన్నారు. మండలంలోని కొండగుంపాంలో బుధవారం పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగికంగా బాల బాలికలను వేధించినా, అవమాన పరిచినా నేరం చేసిన వ్యక్తికి కనీసంగా 20ఏళ్లు, గరిష్టంగా జీవిత ఖైదు విధిస్తారని చెప్పారు. చాలా ప్రాంతాల్లో బాలికలకు దగ్గరి వారే హాని కలిగిస్తున్నారని దీనిపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా తల్లిదండ్రులు వారి పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలని కోరారు. తెలియని టీనేజ్ వయస్సులో లేనిపోని ఆకర్షనలకు గురవుతున్నారని, ఇంటర్‌నెట్ ప్రభావలకు లోను కాకుండా విద్య పై దృష్టి సారించాలని సూచించారు. ఈ సదస్సులో బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం. రోహిణీరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డి. సీతారాం, సర్పంచ్ పతివాడ అప్పన్న, ఎస్ఐ ఎం.గణేష్, సచివాలయ కార్యదర్శి ఎల్ తౌడు, సచివాలయ, జిల్లా న్యాయ సేవాధికార, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్జి విజయ కల్యాణి

29న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - బొబ్బిలి

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బొబ్బిలి రాజా ఆర్‌ఎస్‌ఆర్‌కె రాంగారావు కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈ నెల 29న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని ఎమ్మెల్యే బేబినాయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, పీజీలలో ఉత్తీర్ణత సాధించి, వయస్సు 18 నుండి 35 సంవత్సరాల మధ్య ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు శనివారం ఉదయం 9గంటల నుంచి 'సంకల్ప మెగా జాబ్ మేళా' నిర్వహించనున్నామన్నారు. ఈ జాబ్ మేళాకు 18 నుండి 20 బహుళ జాతి కంపెనీలు హాజర్రై, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలలో ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి కలిగిని నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, అడ్మిట్ కార్డుతో పాటుగా రెస్యూమ్, ఆదార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, ఒక జత జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7286042743, టోల్‌ఫ్రీ 9988853335 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండల పరిధిలో 516బి జాతీయరహదారి కోసం భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుంటే భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నిర్ణయించారు. జాతీయ రహదారికి కోల్పోతున్న భూముల నష్టపరిహార విషయమై గ్రీవెన్స్‌లో వేసిన ఫిర్యాదుకు విచారణ జరిపేందుకు ఎస్‌కోట వచ్చిన రెవెన్యూ అధికారులతో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ ఎస్.కోటకు బైపాస్ రోడ్డు అవసరం లేదని ఎందుకంటే ప్రస్తుతం విశాఖ అరకు రోడ్డు మ్యాపులో 180 అడుగుల విస్తీర్ణం రాసి ఉందని అన్నారు. కానీ రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురయ్యాయని

చర్చల్లో పాల్గొన్న రైతులు, నాయకులు

అధికారులు వాటిని స్వాధీనం చేసుకుంటే బైపాస్ రోడ్డు అవసరం ఉండదని చెప్పారు. మండలంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను ప్రైవేటు వ్యక్తుల ఆక్రమించి విచ్చలవిడిగా వ్యాపారాలు చేసుకుంటున్నారని రోడ్డు ఆక్రమణలు తొలగించి పెందుర్తి బొడ్డవర 516బి జాతీయరహదారి పనులు కొనసాగించాలని 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని లేనిచో ల్యాండ్ కన్వర్షన్‌కు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

బైపాస్‌లో భూములు కోల్పోతున్న రైతన్నలకు ప్రభుత్వం ఇస్తున్న పరిహారంతో పాటు భూమికి బదులు భూమి ఇవ్వాలని, రైతుల అభిప్రాయం 70శాతం ఆమోదిస్తేనే పనులు ప్రారంభించాలని కాదని బలవంతంగా తమ పంట పొలాల్లో పనులు ప్రారంభిస్తే తోటపల్లి పోరాటాన్నీ సవి చూడవలసివస్తుందని హెచ్చరించారు. ఈ చర్చల్లో భూములు కోల్పోతున్న రైతులు వసంత సత్యారావు, మల్లా సత్యారావు, కోటాన సూర్యం, మంచిన రాము, పిల్లల రమణ, పొలమరశెట్టి రామకృష్ణ, పి సూరిబాబు, రాము, సన్నిబాబు తదితర పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునా యుడుపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఉత్తరాంధ్ర జోనల్ ఆర్‌టిసి చైర్మన్ దొన్ను దొరకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ మండలంలోని సోంపురం, జాకేరు, కరకవలస, చామ లాపల్లి, దబ్బిరాజుపేటతో పాటు గిరిజన గ్రామాలైన మారిక, వెంకయ్యపాలెం, పోతుబంది పాలెంలో గల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివేందుకు బస్సు సౌకర్యం లేక ప్రైవేటు పాఠశాలలను

దొరకు వినతినిస్తున్న అప్పారావు

ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించే స్తోమత లేని తల్లిదండ్రులు పిల్లలను చదువు మాన్పించే స్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత చదువులు అందుతున్నప్పటికీ పాఠశాలకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ విషయంపై పలుమార్లు ఎస్‌కోట ఆర్‌టిసి అధికారులకు వినతి పత్రాలు అందించామని గుర్తు చేశారు. అధికారులు స్పందించ కపోవడంతో జిల్లా కలెక్టర్ సైతం తన విజ్ఞాపన పత్రాలు అందించామని ఆయన స్పందించి వెంటనే బస్సు ఏర్పాటు చేయాలని ఆదేశించినప్పటికీ పలు రకాల అభ్యంతరాలు తెలుపుతూ ఇప్పటికీ బస్సు సౌకర్యం కల్పించలేదని చెప్పారు. పాఠశాల లకు సెలవులు ఇచ్చే ముందు బస్సు నడిపితే విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేరుస్తారని కోరారు. దీనికి స్పందించిన ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్యార్థులకు ఎప్పుడూ అండగా ఉంటుందని బస్సు ఏర్పాటుకు ఉన్నతాధికారులతో మాట్లాడి పాఠశాలలకు సెలవలకు ముందే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి- రాజాం

ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో ఎమ్మెల్యేకు అందజేశారు. అనంతరం రాజాం మార్కెట్ యార్డ్‌లో నిర్వహించిన స్వయం సంఘ సభ్యులకు మెగా రుణాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు డ్వాక్రా సంఘాలు నెలకొల్పి కోట్ల మంది మహిళా జీవితంలో వెలుగు నింపారని, పిఎంఈజిపివి పథకం ద్వారా 35 శాతం రాయితీతో 50 లక్షలు వరకు బ్యాంకులు అనుసంధానంతో చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటుకు రుణాల అందిస్తున్నామని చెప్పారు. వైసిపి ప్రభుత్వం నిర్వీర్యం చేసిన డ్వాక్రా సంఘాలకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అనంతరం మహిళా స్వయం సహాయక సంఘా లకు రూ.8.53కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు కార్యకర్తలు, పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళి

కొవ్వాడలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

తల సేమియాతో బాధపడుతున్న పిల్లలు కోసం మండలంలోని కొవ్వాడ అగ్రహారంలో కొవ్వాడ యూత్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 120 మంది యువకులు పాల్గొని న్యూలైఫ్ బ్లడ్ సెంటర్‌కు 100 యూనిట్లుకు పైగా రక్తదానం చేశారు. రక్తదానం చేసిన యువతకు న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ నుంచి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొవ్వాడ సర్పంచ్ కోట్ల రఘు, కొవ్వాడ యూత్‌ను అభినందించారు. రక్తదానంలో పాల్గొన్న యువకులకు ఒక్కొక్కరికి హార్లిక్స్ సీసా అందజేశారు. రక్తదానంలో పాల్గొన్న యువతి చందక తులసీ, మండల వికలాంగుల సంగం నాయకులు మిరప రమణతో పాటు పలువురును సర్పంచ్ రఘు సాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల సేమియా బాధితులు కోసం రక్తదానం శిబిరం నిర్వహించడం మంచి పరిణామమన్నారు. తమ గ్రామ యువత స్ఫూర్తి కలిగి ఉండడం ఆనందంగా ఉందన్నారు. రక్తదానం చేసిన యువతను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారంగా అందరికి హార్లిక్స్ సీసాలను అందించానన్నారు. న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ వైద్యులు హిమిని, కోఆర్డినేటర్లు గోపీకృష్ణ, వినయ్, సామంతుల సోంబాబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం : కర్రోతు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరు సమిష్టిగా పని చేయాలని టిడిపి నియోజకవర్గం ఇంచార్జి, మార్క్ ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారాజు పిలుపునిచ్చారు. బుధవారం నెల్లిమర్లలో టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో బూత్ యూనిట్, క్లస్టర్ ఇంచార్జిలు, మండల/నగర పంచాయతీ పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. కుటుంబ సాధికార సారధుల నియామకంపై, సభ్యత్వం కార్డులు, ఓటర్ లిస్టులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంగారాజు మాట్లాడుతూ ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు త్వరితగతిన కుటుంబ సాధికార సారధుల, పార్టీ అనుబంధ కమిటీలను నియమించుకోవాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 2024 ఎన్నికల స్ఫూర్తితో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో కార్యకర్తలు ఎవరూ అసంతృప్తి చెందవద్దని ఓపిగ్గా ఉండాలని రానున్న రోజుల్లో

సమావేశంలో మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగారాజు

పార్టీ ప్రతి ఒక్కరినీ గుర్తిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గం డెకాండ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాద్ రావు, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ, పూసపాటి రేగ మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, కర్రోతు సత్యనారాయణ, పల్లె భాస్కర్ రావు, మహంతి శంకర్రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ కార్యదర్శి లంక అప్పలనాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి చీకటి సుహాసిని, గరికిపేట పార్టీ అధ్యక్షులు చింతపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫిర్యాదు పై పరిశీలన

ప్రజాశక్తి- బొబ్బిలి

ఇటీవల పాత బొబ్బిలిలో నిర్మించిన కాలువలో నీరు నిలిచిపోతుందని, కమ్యూనిటీ టాయిలెట్ వద్ద ఉన్న అవుట్ ఫాల్ డ్రైన్‌లో సైతం నీరు పారకుండా నిలిచిపోతుందని ఫిర్యాదు రావడంతో ఆయా ప్రాంతాలను బుధవారం కమిషనర్ ఎల్. రామలక్ష్మి పరిశీలించారు. పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, ఇన్చార్జిలు పాల్గొన్నారు.

6 ఎకరాల్లో తోట దగ్ధం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని తంగుడుబిల్లిలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించి 6 ఎకరాల్లో తోట దగ్ధమయ్యింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామంలో బారికొడు తోటలో నిప్పులు చెలరేగి 6 ఎకరాల్లో మామిడి తోట, టేకు తోటలు దగ్ధమయ్యాయి. మంటలు చెలరేగి కల్లాలు, ఊరిలోకి ప్రవేశించే నేపథ్యంలో ఎంపిటిసి చందక చిన్నంనాయుడు ఆధ్వర్యంలో గ్రామస్థులు స్పందించి మంటలను అర్పి వేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

మట్టి, రాయి తరలింపునకు టోల్ వద్దు

● సిబ్బందిని ఆదేశించిన అధికారి ● ఆందోళన విరమించిన రైతులు, కార్మికులు

ప్రజాశక్తి- వేపాడ

రైతులకు అవసరమైన మట్టి, ఇళ్లకు అవసరమైన మట్టి, పునాదిరాయి తరలించే వాహనాలకు టోల్ వసూలు చేయవద్దని ఉత్తరాంధ్ర మైన్స్ అండ్ జియాలజీ విజిలెన్స్ ఏడి అజయ్‌కుమార్ అన్నారు. గత నాలుగు రోజులుగా బొద్దాం ప్రైవేట్ టోల్గేట్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఆందోళన వద్దకు బుధవారం ఆయన వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు చల్లా జగన్ మైనింగ్ అక్రమాలు, రైతులు, కార్మికుల కష్టాలను, ప్రైవేట్ టోల్గేట్ సిబ్బంది విజిలెన్స్ బోర్డులు పెట్టుకొని అక్రమాలు చేస్తున్న వైనాన్ని ఆయనకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ టోల్గేట్ సిబ్బంది చేస్తున్న అక్రమాలపై రాతపూర్వక ఫిర్యాదు ఇవ్వాలని తెలిపారు. రైతులకు అవసరమైన మట్టి, ఇళ్లకు అవసరమైన మట్టి పునాదిరాయి తోలకాన్ని ఆటంక పరచకుండా ప్రైవేట్ టోల్గేట్ రాఘవ కన్‌స్ట్రక్షన్‌కు ఆదేశించారు. దీంతో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆందోళన కార్యక్రమాన్ని ఉద్యమకారులు విరమించారు. ఆందోళన వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ఎస్‌కోట రూరల్ సిఐ అప్పలనాయుడు, ఎస్ఐ దేవి బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ ఏజి మల్లేశ్వరరావు, బొద్దాం గ్రామ పెద్ద ఎర్ర సన్యాసిరావు, యూనియన్ నాయకులు గేదెల శ్రీను తూర్పాటి సతీష్, చలుమూరు శ్యామ్, పత్రాని కృష్ణ, వల్లంశెట్టి రవి, అలమండ శివప్రసాద్, అలమండ రామకృష్ణ, వాకాడ బాలు, కనిశెట్టి సన్నిబాబు, బూరెడ్డి సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - బొండపల్లి

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాయని బొబ్బిలి డిఎస్‌పి భవ్యరెడ్డి అన్నారు. బుదవారం సాయంత్రం మండలంలోని ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న కారణాలను తెలుసు కొనేందుకు బోడసింగిపేట, అంబటి వలస, గొట్లాం జాతీయ రహదారులను ఆమె పరిశీలించారు. ఈ మేరకు గజపతి నగరం సిఐ జివి రమణ ఆధ్వర్యంలో బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న పలు చర్యలను ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి దాటి పాఠశాలకు వెళుతున్న విద్యార్థులకు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా ప్రజా చైతన్యం ద్వారా ప్రమాదాలను నివారించ డానికి అవకాశం ఉంటుందని చెప్పారు. జాతీయ రహదారిపై స్టాపర్లను ఏర్పాటు చేయడం ద్వారా ప్రాణాలను కాపాడ వచ్చినని సూచించారు.

హైవేపై వాహన తనిఖీలు

భోగాపురం : మండల కేంద్రం బుధవారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు రవాణా అరికట్టేందుకు తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐలు పాపారావు, సూర్యకుమారి తెలిపారు. వాహనాల్లో ప్రయాణికులను, రవాణా చేస్తున్న సామాగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఒక పక్క వాహనాలు తనిఖీ నిర్వహిస్తూనే మరోపక్క వాహన చట్టాలు, ట్రాఫిక్ నియమాలు గురించి వాహనదారులకు అవగాహన కల్పించారు. హెల్మెట్ ఖచ్చితంగా ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్సు, వాహనాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.


భోగాపురం: కారును తనిఖీ చేస్తున్న పోలీసులు